## క్లుప్తంగా

### నేత్రదానంతో మరో ఇద్దరికి చూపు



కుటుంబ సభ్యులతో ఫౌండేషన్ సభ్యులు

పెద్దపల్లిరూరల్: పట్టణంలోని ప్రగతినగర్‌కు చెందిన బొడ్డుపల్లి నర్సయ్య ఇటీవల మరణించారు. కాగా ఆయన నేత్రాలను దానం చేసేందుకు ముందుకొచ్చిన కుటుంబీకులు సదాశయ ఫౌండేషన్ సభ్యులకు సమాచారం అందించారు. వ్యవసాయశాఖలో అటెండర్‌గా పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన నర్సయ్య నేత్రాలు సజీవంగా ఉండి మరో ఇద్దరికి చూపు నిచ్చాయన్నారు. ఇందుకు సహకరించిన కుటుంబసభ్యులను సదాశయ ఫౌండేషన్ అధ్యక్షుడు శ్రావన్‌కుమార్, ప్రధాన కార్యదర్శి లింగమూర్తి కుటుంబీకులను అభినందించారు. నేత్రదాత కుటుంబీకులు రమేశ్, సమ్మయ్య, పద్మ, వసంత, సునీత తదితరులు పాల్గొన్నారు.

### వ్యాపార, వాణిజ్య సంస్థలు సెలవు ప్రకటించాలి

జ్యోతినగర్: అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ రోజున వ్యాపార, వాణిజ్య సంస్థలు, కర్మాగారాలు సెలవుదినంగా ప్రకటించాలని రాష్ట్ర గోదావరిఖని సహాయ కార్మికశాఖ అధికారి శ్రీకాంత్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం జరగనున్న ఎన్నికల పోలింగ్ రోజున వేతనంతో కూడిన సెలవుదినంగా ప్రకటించిందన్నారు. వ్యాపార, వాణిజ్య సంస్థలు సెలవు దినంగా ప్రకటించి సిబ్బందిని ఓటుహక్కు వినియోగించుకునేందుకు వేతనంతో కూడిన సెలవు ఇవ్వాలని ఆదేశించారు. నిబంధనలు పాటించని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

### అయ్యప్ప భక్తులకు భిక్ష



వడ్డిస్తున్న దంపతులు

ఓదెల: మండలంలోని పొత్కపల్లి గ్రామంలోని శివాలయంలో అదే గ్రామానికి చెందిన నాగలక్ష్మి–చంద్రమోహన్ దంపతులు బుధవారం భిక్ష నిర్వహించారు. పొత్కపల్లి, జీలకుంట, శానగొండ గ్రామాలకు చెందిన 50మంది అయ్యప్ప భక్తులు భిక్షలో పాల్గొన్నారు. కార్యక్రమంలో గురు, కత్తి, కన్నెస్వాములు ఉన్నారు.

### 'పోలింగ్ స్లిప్పులు అందలేదు'

పెద్దపల్లిరూరల్: శాసనసభ సాధారణ ఎన్నికల పోలింగ్ గురువారం జరగనుంది. ఈ ఎన్నికల్లో ఓటు వేసేందుకు వీలుగా ఓటర్లకు పోలింగ్ స్లిప్పులను బీఎల్‌వోలు అందించాలని ఎన్నికల అధికారులు ఆదేశించారు. అయినా ఇప్పటివరకు తమకు స్లిప్పులు అందలేదని పెద్దపల్లి మున్సిపల్ పరిధిలోని పలు వార్డులకు చెందిన ఓటర్లు వాపోతున్నారు. ఎన్నికల అధికారులు పోలింగ్ కేంద్రాల సమీపంలోనైనా పోలింగ్ స్లిప్పులు అందించేలా చూడాలని కోరుతున్నారు.

### కార్మికులంతా ఓటుహక్కు వినియోగించుకోవాలి

పెద్దపల్లిరూరల్: అసెంబ్లీ ఎన్నికల్లో ఓటుహక్కును వినియోగించుకునేందుకు వీలుగా దుకాణాలు, వ్యాపార, వాణిజ్య సంస్థల్లో పనిచేసే కార్మికులకు వేతనంతో కూడిన సెలవు మంజూరు చేయాలని కార్మికశాఖ డిప్యూటీ కమిషనర్ శామ్యూల్‌జాన్ తెలిపారు. జిల్లాలోని వ్యాపార సంస్థల యజమానులు గురువారం కార్మికులు ఓటుహక్కును వినియోగించుకునే విధంగా సహకరించాలన్నారు. ఇందుకు విరుద్ధంగా వ్యవహరించే వ్యాపారులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

### విద్యార్థుల స్టడీ టూర్



భద్రాచలంలోని పాపికొండల సందర్శనలో విద్యార్థులు

సుల్తానాబాద్: పట్టణంలోని వివేకానంద పాఠశాల విద్యార్థులు భద్రాచలం పాపికొండలను సందర్శించారు. బుధవారం సుల్తానాబాద్ నుంచి బయలుదేరి పాపికొండలను చేరుకున్నారు. పాపికొండలు, వాటి విశిష్టత నాగరికతను వివేకానంద పాఠశాల కరస్పాండెంట్ రవీందర్ విద్యార్థులకు వివరించరు. పాపికొండల్లో పడవ ప్రయాణం చేసి విద్యార్థులకు పాపికొండల విశిష్టతను, భద్రాచలంలోని రాముని గొప్పతనాన్ని వివరించారు. కార్యక్రమంలో సుజాత ఉన్నారు.

# పోలింగ్ కేంద్రాలకు చేరిన సిబ్బంది

- అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసుల బందోబస్తు



రామగుండం: కుందనపల్లి పోలింగ్ కేంద్రంలో..



సుల్తానాబాద్: సుల్తానాబాద్‌కు చేరిన సామగ్రిని పరిశీలిస్తున్న ఉద్యోగులు

సుల్తానాబాద్: అసెంబ్లీ ఎన్నికలు గురువారం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు తహసీల్దార్ మధుసూదన్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్, పీవో1, ఏపీవో1 తెలిపారు. పట్టణంలో పూసాల, సుల్తానాబాద్, సుగ్లాంపల్లి, పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. ఇందులో పీవోలు, ఏపీవోలు సిబ్బందిని నియమించారు. పారా మిలిటరీ సిబ్బంది నియమించారు. రూట్ ఆఫీసర్లను అన్ని పోలింగ్ కేంద్రాలకు సామగ్రిని, సిబ్బందిని వాహనాల్లో తరలించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండేందుకు పెద్దపల్లి ఏసీపీ ఎడ్ల మహేశ్, సుల్తానాబాద్ సీఐ జగదీశ్, ఎస్సై విజేందర్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు.

**ప్రత్యేక ఏర్పాట్లు**

రామగుండం: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో గురువారం ఉదయం 7గంటలకు పోలింగ్ ప్రారంభం కానుంది. దీంతో ఒకరోజు ముందుగానే ఎన్నికల సిబ్బంది పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. కాగా అప్పటికే పోలింగ్ కేంద్రాలకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. అలాగే భద్రతా సిబ్బందిని నియమించారు. ఎన్నికల సిబ్బందికి మౌళిక సదుపాయాల కల్పనపై పంచాయతీ కార్యదర్శి కృష్ణ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు.

**ఓదెలలో పోలీసుల బందోబస్తు**

ఓదెల: మండలంలో జరిగే సాధారణ ఎన్నికలకు పోలింగ్ కేంద్రాలు సిద్ధమయ్యాయి. గురువారం జరిగే ఎన్నికల కోసం మండలంలోని 22 గ్రామాల్లో పోలింగు కేంద్రాలకు సిబ్బంది చేరుకున్నారు. ఓటర్లు ఓటు వేయడానికి ఈవీఎం మిషన్లు కేంద్రాలకు చేరుకున్నాయి. పోలింగు కేంద్రాల వద్ద ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సంబంధిత శాఖాధికారులు ఏర్పాట్లు చేశారు. ఎన్నికల కేంద్రాల వద్ద ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. పొత్కపల్లి ఎస్సై నూతి శ్రీధర్ గస్తీని ముమ్మరం చేశారు.

**జూలపల్లి మండలంలో..**

జూలపల్లి: మండల కేంద్రంతో పాటు గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల అధికారులు చేరారు. సామగ్రితో పాటు, ఈవీఎంలు వీవీప్యాడ్‌లు తీసుకుని తమకు కేటాయించిన కేంద్రాలకు చేరుకున్నారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌లో మౌళిక సదుపాయాలు, సౌకర్యాలను ఎంపీడీవో వేణుగోపాలరావు పరిశీలించారు.

**ముత్తారం మండలంలో..**



ముత్తారం చేరుకున్న ఎన్నికల సిబ్బంది

ముత్తారం: మండలంలో 14 గ్రామ పంచాయతీల్లోని 25 పోలింగ్ కేంద్రాలకు బుధవారం ఎన్నికల సిబ్బంది చేరుకున్నారు. పోలింగ్ కేంద్రాలకు చేరుకున్న ఎన్నికల సిబ్బందికి సెక్టోరల్ అధికారులు, స్థానిక సిబ్బంది స్వాగతం పలికారు. మండలంలో 14గ్రామ పంచాయతీల్లో 22,390 ఓటర్లు ఉన్నారు. సెక్టోరల్ అధికారులు మండలంలోని ఓడేడ్, ముత్తారం, పారుపల్లికి వేణుమాధవ్, ధర్యపూర్, కేశనపల్లి, అడవిశ్రీరాంపూర్‌కు చిందం శ్రీకాంత్, హరిపురం, పోతారం, మైదంబండ, మచ్చుపేట, లక్కారం గ్రామాలకు ప్రణవ్, ఖమ్మంపల్లి, సీతంపల్లి, ఇప్పలపల్లిలో సమీద్దీన్ పర్యవేక్షణ ఉంటుందని మండల ఎన్నికల అధికారి, తహసీల్దార్ రాజేశ్వరి వివరించారు. పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల నిర్వహణ ప్రశాంతంగా జరగడానికి అన్ని ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ చెప్పారు. పారుపల్లి పంచాయతీ మానేరు అవతలలోని శాత్రాజ్‌పల్లి ఓటర్ల కోసం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసినట్లు తహసీల్దార్ పేర్కొన్నారు.

**కాల్వశ్రీరాంపూర్ మండలంలో..**

కాల్వశ్రీరాంపూర్: అసెంబ్లీ ఎన్నికలు గురువారం జరగనున్నందున కాల్వశ్రీరాంపూర్‌లో బుధవారం రిటర్నింగ్ ఆఫీసర్లు, సిబ్బంది ఈవీఎం బాక్స్‌లు, ఇతర సామగ్రితో ఆయా బూత్‌లకు చేరారు. కాలవశ్రీరాంపూర్, పెగడపల్లి గ్రామాల్లో మోడల్ పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేశారు. కాల్వశ్రీరాంపూర్‌లో మహిళా ఎన్నికల అధికారులకు స్థానిక అంగన్‌వాడీ టీచర్లు స్వాగతం పలికారు. ఎటువంటి అవాంచనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆయా గ్రామాల్లో ఎస్సై శ్రీనివాస్ పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారు. ఎన్నికల సిబ్బందికి తహసీల్దార్ జాహెద్ పాషా, ఎంపీడీవో రామ్మోహనాచారి పోలింగ్ ఆఫీసర్లకు, సిబ్బందికి భోజనంతో పాటు, సౌకర్యాలు ఏర్పాటు చేశారు.



ఓదెల: కొలనూర్‌లో పోలింగ్ కేంద్రం వద్ద..



జూలపల్లిలో..



కాల్వశ్రీరాంపూర్‌లో..

# ఓవర్‌లోడ్ వాహనాలతో రోడ్లు ధ్వంసం

కాల్వశ్రీరాంపూర్: కాల్వశ్రీరాంపూర్ నుంచి పెద్దపల్లి, సుల్తానాబాద్ వైపు వెళ్లే రహదారిపై నిత్యం సిమెంట్, కంకర, ఇసుక, ఎర్రమట్టి, మొరం లారీలు ఓవర్‌లోడ్‌తో వెళ్లడంతో సీసీరోడ్లు సైతం ధ్వంసం అవుతున్నాయి. ఒక్కోసారి లారీలు ఒక వైపు వంగడంతో ప్రయాణికులపై సరుకులు పడడం, ఒక్కోసారి అతివేగంతో వాహనాలు వెళ్లడంతో వాహనదారులు ప్రమాదానికి గురవుతున్నారు. ఒక్కోసారి రోడ్లు కుంగడంతో తాగునీటి పైపులైన్‌లు పైపులు పగిలి తాగునీటి సరఫరాకు ఆటంకం ఏర్పడుతోంది. ఓవర్‌లోడ్‌తో వెళ్తున్న వాహనాల రాకపోకలతో కుంగిన రోడ్లు పగిలిన పైపులైన్లు మరమ్మతు చేయడంతో ఆయా గ్రామ పంచాయతీలకు భారమవుతోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు భారీ వాహనాలు ఓవర్‌లోడ్‌తో వెళ్లకుండా కట్టడి చేయాలని గ్రామస్తులు ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు.



ఓవర్‌లోడ్‌తో వెళ్తున్న లారీ, ధ్వంసమైన రోడ్డు




### వైకుంఠధామం.. నిరుపయోగం

సుల్తానాబాద్‌రూరల్: ఆఖరి మజిలీకి అవస్థలు లేకుండా అంత్యక్రియలు నిర్వహించేందుకు ఏర్పాటు చేసిన వైకుంఠధామాలు నేటికీ నిరుపయోగంగా ఉన్నాయి. దీంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. సుల్తానాబాద్ మండలం నర్సయ్యపల్లి గ్రామంలో రెండు సంవత్సరాల క్రితం నిర్మించిన వైకుంఠధామం నేటికీ ఉపయోగించుకునే పరిస్థితి లేదు. గ్రామానికి రెండు కిలోమీటర్ల దూరంలో వైకుంఠధామాన్ని నిర్మించడమే ఇందుకు కారణం. అధికారుల ఒత్తిడితో నిర్మించాలనే ఉద్దేశంతో నిర్మించారు. కానీ ఉపయోగం లేకపోవడంతో నిధులు వృథా అయ్యాయని గ్రామస్తులు వాపోతున్నారు. ప్రజలకు అందుబాటులో ఉండేలా వైకుంఠధామం నిర్మించాలని వారు కోరుతున్నారు.

### బీఆర్‌ఎస్ తప్పుడు ప్రచారంపై ఆగ్రహం



మాట్లాడుతున్న బీఎస్పీ అభ్యర్థి దాసరి ఉష

పెద్దపల్లిరూరల్: అధికారం పోతుందన్న భయంతో బీఆర్‌ఎస్ నాయకులు బీఎస్పీపై విషపూరిత ఆరోపణలు చేస్తూ నీచ రాజకీయాలకు దిగజారారని బీఎస్పీ పెద్దపల్లి అభ్యర్థి దాసరి ఉష ఆగ్రహం వ్యక్తం చేశారు. పెద్దపల్లిలో బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. ప్రజల్లో బీఎస్పీకి పెరిగిన ఆదరణను చూసి ఓర్వలేక ఓటమి భయంతో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ నేతలు నిందారోపణలకు దిగారని మండిపడ్డారు. బీసీలంతా ఏకమై చిల్లర రాజకీయాలు చేసే దొరలకు తమ శక్తి ఏంటో చూపుతారన్నారు. సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజు, జెడ్పీటీసీ బండారి రామ్మూర్తి, కౌన్సిలర్లు పోతని పురుషోత్తం, బొంకూరి భాగ్యలక్ష్మి, నాయకులు సురేందర్ సన్నీ, సిరవేన స్వప్న పాల్గొన్నారు.

### ఈవీఎం పరికరాలు ఇలా..

ప్రతీ పోలింగ్ కేంద్రంలో ఏర్పాటు చేసిన ఈవీఎంలో మూడు పరికరాలు ఉంటాయి. అవి కంట్రోల్ యూనిట్, బ్యాలెట్ యూనిట్, వీవీప్యాట్. కంట్రోల్ యూనిట్ పోలింగ్ అధికారి (మూడో అధికారి) వద్ద ఉంటుంది. బ్యాలెట్ యూనిట్ అంటే ఓటరు మీట నొక్కే విభాగం. దీంతోనే ఓటు హక్కు వినియోగించుకుంటారు. వీవీ ప్యాట్‌ను బ్యాలెట్ యూనిట్‌కు ఎడమ వైపుగా ఏర్పాటు చేస్తారు. మీట నొక్కిన తర్వాత వీవీప్యాట్ సరిచూసుకునేందుకు వీలు కల్పిస్తూ ఏడు సెకన్ల పాటు నిలిచి ఉంటుంది. తర్వాత అది కట్ కావడంతో ఎంపిక చేసిన బాక్స్‌లో పడుతుంది.

### రోడ్డుపై పేరుకుపోయిన దుమ్ముతో ఇబ్బంది



రోడ్డుపై ఇరువైపులా ఉన్న ఇసుక, దుమ్ము

సుల్తానాబాద్: రాజీవ్ రహదారిపై రోడ్డుకు ఇరువైపులా ఇసుక, మట్టి పేరుకుపోవడంతో రహదారి వెంట వెళ్లే వారికి తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని వాహనదారులకు వాపోతున్నారు. సుల్తానాబాద్ మండల కేంద్రంతో పాటు పలు ప్రాంతాల్లో ఇసుక, మట్టి సమస్యతో వాహనాదారులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వెంటనే కాంట్రాక్టర్ చొరవ తీసుకొని శుభ్రం చేసి ఇబ్బందులు కలగకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.



### పొంచి ఉన్న ప్రమాదం

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి పట్టణ శివారులోని రంగంపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద రాజీవ్‌రోడ్డుపై పెద్దసైజు పైపులు ప్రమాదకరంగా మారాయి. నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగించే ఈ రోడ్డుపై ఇలా పైపులు వదిలేయడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. వానలు కురిసినప్పుడు రోడ్డుపై నుంచి నీళ్లు ప్రవహిస్తున్న కారణంగా తొలగించిన పైపులను తిరిగి వేయడంలో అధికారులు అలసత్వం ప్రదర్శిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. ప్రమాదాలు జరగకముందే రాజీవ్‌రోడ్డుపై ఉన్న పైపులను తొలగించాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.

### వైన్‌షాపు ఏర్పాటుపై విచారణ

రామగిరి: కల్వచర్ల గ్రామ పంచాయతీ పరిధిలోని గోకుల్‌నగర్‌లో నూతన వైన్‌షాపు ఏర్పాటుపై మంగళవారం ఎక్సైజ్ సీఐ గురువయ్య విచారణ చేపట్టారు. గ్రామస్తులు గోకుల్ నగర్‌లో వైన్‌షాపు ఏర్పాటు చేయొద్దని కలెక్టర్, జిల్లా ఎక్సైజ్ అధికారులకు ఫిర్యాదు చేయగా విచారణ చేపట్టారు. గ్రామస్తులందరూ వైన్ షాపు ఏర్పాటును వ్యతిరేకించారు. ఇట్టి విషయంపై సీఐ గురువయ్యను సాక్షి వివరణ కోసం ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు.

# విస్తృతంగా పోలీసుల వాహన తనిఖీలు



వాహనాన్ని తనిఖీ చేస్తున్న సీఐ చంద్రశేఖర్‌గౌడ్

జ్యోతినగర్: రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా బుధవారం రాత్రి ఎన్టీపీసీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని అంబేడ్కర్ సెంటర్‌లో తనిఖీ చేశారు. సీఐ చంద్రశేఖర్‌గౌడ్ స్వయంగా పోలీసు సిబ్బందితో కలిసి విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. రహదారిపై ప్రయాణిస్తున్న వాహనాలను ఆపి పూర్తిగా తనిఖీ చేశారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.



### ప్రమాదకరంగా గుంత

ఓదెల: ఓదెల మల్లికార్జునస్వామి దేవస్థానంలో ప్రధాన రహదారిపై ఏర్పడిన గుంత ప్రయాణికులకు ఇబ్బందిగా మారింది. భక్తులకు కొంగుబంగారంగా ప్రసిద్ధిగాంచిన ఓదెల మల్లన్న భక్తులకు గుంత ప్రమాదకరంగా మారింది. చాలా రోజులుగా ప్రధాన రహదారిపైన గుంత పడడంతో భక్తులు శివసత్తుల కాలుపడడంతో గాయాల పాలవుతున్నారు. ఆలయ సిబ్బంది, పాలకవర్గ సభ్యులు వెంటనే మరమ్మతు చేసి బాగుచేయాలని భక్తులు కోరుతున్నారు.

### శిథిలావస్థలో మురుగు కాలువ



రామగుండం: పట్టణంలోని ప్రధాన మురుగు కాలువ పూర్తిగా శిథిలావస్థకు చేరింది. దీంతో పాటు ఇరువైపులా పిచ్చిమొక్కలు గుబురుగా పెరిగి మురుగు నీటి ప్రవాహానికి అడ్డంకిగా మారాయి. బల్దియా అధికారులు పారిశుధ్య నిర్వహణకు కోట్లాది నిధులు వెచ్చిస్తున్నామంటూ ప్రకటనలు గుప్పిస్తున్న వారికి రామగుండం పట్టణంలోని ప్రధాన డ్రైనేజీ దుస్థితి నిదర్శనమని స్థానికులు అంటున్నారు.